# ఒక మరణం – ఒక చావు

**మం**త్రిగారి బామ్మగారు మరణించారు. సరిగ్గా రాత్రి తొమ్మిదిన్నరకి యిహ లోకయాత్ర చాలించి పరలోకానికి ప్రయాణం కట్టారు. సమయానికి మంత్రిగారు ఊళ్ళో లేరు. తమ బామ్మగారికి రోజులు దగ్గరికొచ్చాయని తెలుసుకున్నవారైనప్పటికిన్నీ, ప్రజాసేవయే పరమధర్మంగా యెంచుకున్నవారు గనక, ఆ రోజు ఉదయమే ఊరి కెళ్ళారు.

అక్కడికి యాభై మైళ్ళ దూరానవున్న ఒకానొక పట్టణంలో, ఆస్పత్రి కట్టాల్సిన స్థలంలో ఆస్పత్రి కట్టనివ్వకుండా, ప్రజలకి యితోధికమైన సేవచేసే సదుద్దేశ్యంతో 'ఎయిర్‌కండిషన్డ్ మరియూ బార్ ఎటాచ్‌డ్' హోటల్ నిర్మించాడొక పుణ్యాత్ముడు. 'ఆ పుణ్యాత్ముడు మరెవరో కాదు. ఒక మంత్రిగారి మేనమామకొడుకే' నంటూంటారు కొందరు పాపాత్ములు. ఆ విషయం మనకప్రస్తుతం, సరే, సదరు హోటలుకి ప్రారంభోత్సవం చెయ్యవలసిందని, మన మంత్రిగారిని "కోరిన వెంటనే" దయతో అంగీకరించి; అతిముఖ్యమైన రాచకార్యాలన్నీ పక్కకు నెట్టి, మరణశయ్య మీదనున్న బామ్మగారినికూడ విడిచిపెట్టి పొద్దున్నే బయలుదేరి అక్కడికెళ్లి పోయారు.

మంత్రిగారి బామ్మగారి వయసు తొంభైనాలుగు సంవత్సరాలు. అంత 'పిన్న' వయసులోనే ఆమె అకాలమరణం చెందినందుగ్గాను – మంత్రిగారి బంధుమిత్రులూ, అనుచరులూ, సహచరులూ యింకా చాలా మంది మంత్రిగారింటి కెళ్ళి భోరున ఏడ్చారు. మరికొందరు మంత్రిగారొచ్చాక ఏడవొచ్చులే, యిప్పట్నించీ ఎందుకు వేస్టనీ, అతికష్టమ్మీద ఏడుపు ఆపుకూ్కచున్నారు.

మంత్రిగారికి అరడజను ట్రంక్‌కాల్సూ, డజను టెలిగ్రామ్సూ వెళ్ళాయి. పురప్రముఖులు కొందరు కార్లు పంపారు. కొందరు స్వయంగా మంత్రిగారి కెదురెళ్ళారు.

ఇతర మంత్రుల యిళ్లకీ, ముఖ్యమంత్రి గారింటికీ, గవర్నర్ గారింటికీ, శాసనసభ్యుల యిళ్ళకీ, న్యాయమూర్తుల యిళ్ళకీ, ఉన్నతాధికారుల యిళ్ళకీ,

పురప్రముఖుల ఇళ్ళకీ వర్తమానాలు వెళ్ళాయి. అంతా హడావిడిగా బయల్దేరి వచ్చేశారు. కొందరు పెద్దలు మట్టుకు మంత్రిగారొచ్చాక కబురు చెయ్యమన్నారు. జనం విపరీతంగా వచ్చారు. పత్రికావిలేఖరులొచ్చారు; ఫోటోగ్రాఫర్లొచ్చారు, పోలీసు వాళ్ళొచ్చారు; సినిమా స్టార్లొచ్చారు. మంత్రిగారి యిల్లు కిటకిటలాడిపోయింది.

కొందరు – కాలుగాలిన పిల్లుల్లా, నిప్పుతొక్కిన కోతుల్లా యింట్లోంచి బయటికీ, బయటినుంచి యింట్లోకీ పరుగులెత్తుతున్నారు. ఒక్కరొక్కరుగా విచ్చేస్తున్న పెద్దలకి స్వాగతాలు చెప్పి లోపలికి తీసుకెళ్తున్నారు. కొందరు – వచ్చిన పెద్దల చుట్టూ చేరుతున్నారు. మరికొందరు మంత్రిగారి బామ్మగారి జీవితవిశేషాలు చెప్పుకుని విచారిస్తున్నారు. కొందరు శవానికి సేవలు చేస్తున్నారు. ఈగలూ, దోమలూ రాకుండా విసనకర్రలు పుచ్చుకు విసురుతున్నారు. కంపు కొట్టకుండా పన్నీరు చల్లుతున్నారు. అగరువత్తులు వెలిగిస్తున్నారు. కొందరు మంత్రిగారి సతీమణికీ, పిల్లలకీ విసురుతున్నారు. ఫాన్ గాలికి ఉక్కిరి బిక్కిరైపోతారని విసనకర్రలు పుచ్చుకుని అతి జాగ్రత్తగా అతిమెల్లగా విసురుతున్నారు; కొందరు కళ్ళు తుడుచుకుంటున్నారు; కొందరు ముక్కులు చీదుతున్నారు; ఓదార్చుదామంటే మంత్రిగారి సతీమణిగాని, పిల్లలుగాని ఏడవడం లేదు; తలో కుర్చీలోనూ సీరియస్‌గా కూర్చున్నారు.

అర్ధరాత్రి పన్నెండున్నరకి – ముందు నాలుగు కార్లూ, వెనక నాలుగు కార్లూ తోడు రాగా – మధ్యనున్న కారులో మంత్రిగారు విచ్చేశారు. కారు తలుపు సొంత చేతుల్తో తెరిచే సౌభాగ్యంకోసమూ, మంత్రిగారికి మొట్టమొదట సానుభూతి తెలియపర్చే మహదవకాశంకోసమూ, మంత్రిగారు లేకపోయినా ఏ లోటూ లేకుండా తామెటువంటి ఏర్పాటు చేశారో విన్నవించుకోవడం కోసమూ – చాలామంది కారుమీది కెగబడ్డారు. లోపలున్నవాళ్ళు కూడా పరుగెత్తుకొచ్చి కారు చుట్టూ మూగారు. పోలీసులు జోక్యం కలుగజేసుకుంటే గాని మంత్రిగారు లోపలికెళ్ళడానికి వీలైంది కాదు.

మంత్రిగారు ఇంట్లోకిరాగానే చాలమంది ఏడవటం, మొదలెట్టారు. మంత్రిగారు మౌనంగా వెళ్ళి బామ్మగారి శవం పక్కన కూచున్నారు. ఉలకలేదు; పలకలేదు; పరమ సీరియస్‌గా శవాన్ని చూస్తూ కూచున్నారు. ఆయనా ఏడవక పోయేసరికి ఓదార్చుదామని కూర్చున్నవాళ్ళకి మరోసారి ఆశాభంగం కలిగింది.

పెద్దలొక్కరొక్కరూ మంత్రిగారి దగ్గరకొచ్చి తమ తీవ్రసంతాపాన్నీ, ప్రగాఢ సానుభూతినీ వ్యక్తపర్చి శెలవు తీసుకువెళ్ళిపోయారు. ఆ తర్వాత మంత్రిగారు తమ

ఆంతరంగికులైనవారితో కొద్దిసేపు ముచ్చటించి, రేపటి అంత్యక్రియల ఏర్పాట్లగురించి ఆదేశాలిచ్చి, మేడమీది కెళ్ళి పోయారు.

★ ★ ★

సరిగ్గా అదేసమయాన – మంత్రిగారింటికి రెండు ఫర్లాంగుల దూరాన – ఒక గుడిసెలో కిరసనాయిల్ దీపం గుడ్డి వెలుగులో – దిక్కూ మొక్కూ డబ్బూ దస్కం ఏమీలేని అభాగ్యుడొకడు – అనామకుడొకడు పాతికేళ్ళ భార్య శవాన్ని ముందెట్టుక్కూచున్నాడు.

అతని భార్యకి తిండి లేక రోగమొచ్చింది. డబ్బు లేక చచ్చిపోయింది. వారం రోజులు నరకయాతన లనుభవించి అంతకి గంట క్రితమే కన్ను మూసింది.

ఏం చెయ్యాలో అతగాడికేం తోచడం లేదు. కాళ్లూ, చేతులూ ఆడ్డం లేదు. బంధువుల్లేరు; స్నేహితుల్లేరు; శవాన్ని తగలెయ్యటానిక్కూడా డబ్బుల్లేవు; కళ్ళనిండా నీళ్ళు మాత్రమున్నాయి; చొక్కానిండా, గుండెనిండా చిరుగులు మాత్రమున్నాయి.

అతని పేరూ ఊరూ అనవసరం; మహామహామంత్రి గారి పేరే మనం చెప్పకోవటం లేదే – ఆ అనామకుడి పేరెందుకు? అనామకుడనే అందాం.

★ ★ ★

తెల్లవారింది.

మంత్రిగారింట్లో మంత్రిగారూ, ఆయన భార్యా పిల్లలూ ఏమో గాని – మంత్రిగారి భక్తబంధుజనం మట్టుకు తెల్లవార్లూ శవజాగరణ చేశారు పాపం! మంత్రిగారి బామ్మగారి ఆకస్మికమరణవార్త విని ఆకాశవాణివారు, చింతిస్తూ ప్రకటించారు. వార్తాపత్రికల్లో మొదటి పేజీల్లో ప్రముఖంగా ప్రచురించారు.

మంత్రిగారి బామ్మగారి ఫొటో దొరక్క – ఒక పత్రికవారు మంత్రిగారి ఫోటోనే వేసేసి – 'ఫలానా మంత్రి గారిపై పిడుగుపాటు – దేశానికి తీరని లోటు' – అని శీర్షిక పెట్టారు. మరో పత్రికాసంపాదకుడు – 'ఫలానా మంత్రిగారి పితామహి మరణం' అని శీర్షిక పెట్టి ప్రెస్సుకి పంపితే – ప్రెస్సులో అక్షరాలు కూర్చే ఆయనకి ఆవేశమొచ్చి అందులో యింకో అక్షరంకూడా చేర్చేశాడు. చివరికి – 'ఫలానా మంత్రిగారి పితామహిషి మరణం' – అని అచ్చయింది. ఆ పత్రిక వారిమీద మంత్రిగారు ఆగ్రహించడం వేరే కథ!

ఉదయం తొమ్మిదిగంటలకి బ్రహ్మాండమైన ఊరేగింపుతో శవయాత్ర ప్రారంభమైంది. ఒక లారీలో పెద్ద వేదిక నమర్చి దానిమీద శవాన్ని పడుకోపెట్టారు. పక్కనే మంత్రిగారు నిలబడ్డారు. మంత్రిగారి భార్యాబిడ్డలూ, యితర పెద్దలూ లారీకి ముందూ, వెనకా కార్లలో కూర్చున్నారు.

ఇంకా కార్లూ, మోటార్ సైకిళ్ళూ, సైకిళ్ళూ, రిక్షాలూ చాలా చేరాయి. మంత్రిగారి యింటికి శ్మశానం అరమైలు దూరముంటే, యివన్నీ కలిసి మైలు పొడవయ్యాయి.

దారిపొడుగునా - చాలామంది ప్రముఖులూ వ్యాపారసంస్థలవారూ, దుకాణాలవారూ బామ్మగారి "భౌతికకాయం" మీద పూలమాలలుంచి, శవానికీ, మంత్రిగారికీ కూడా నమస్కారాలు చేసి తమతమ భక్తిప్రపత్తులు వెల్లడించుకున్నారు. శ్మశానానికి చేరేటప్పటికి పదకొండైంది. అప్పటికే అక్కడొక పెద్ద చితి అందంగా పేర్చివుంచారు. పైన రెండొరసలు గంధపుచెక్కలు కూడా పేర్చారు. కలప వ్యాపారస్తుల సంఘంవారు ఒక లారీ నిండా మాంచి ఎండు కట్టెలు పంపారు; నూనెవర్తకుల సంఘంవారు నేతిడబ్బాలు పంపారు.

మంత్రిగారితో పాటు యితర పెద్దలు కూడా కార్లు దిగి, చితివరకూ నడిచారు. మిగతా జనాన్ని కాస్త ఎడంగానే పోలీసులాపేశారు. దహనకాండ ప్రారంభమయ్యే ముందు - మంత్రిగారి కుడి భుజ మొకాయన కాస్సేపు ఉపన్యసించాడు. బామ్మగారి గుణగణాల్ని ప్రశంసించి, ఆవిడ మరణం రాష్ట్రానికే కాక, యావద్భారతదేశానికీ, మళ్ళీ మాట్లాడితే యావత్ప్రపంచానికీ ఎంత నష్టమో వివరించాడు. తనకీ అవకాశం కలిగించినందుకు బామ్మగారికి కృతజ్ఞతలు చెప్పుకుని ఉపన్యాసం విరమించాడు. మంత్రిగారి ఎడం భుజంకూడా మాట్టాడదామనుకున్నాడు గాని, మంత్రిగారే వద్దని వారించారు.

బామ్మగారి మరణానికి దేవతలు కన్నీరు కారుస్తున్నట్టుగా - సన్నగా చినుకు ప్రారంభమైంది. చితి మీద శవాన్ని పడుకోబెట్టారు; జరగవలసిన తతంగమంతా జరిగాక, చితి మీద నెయ్యి కుమ్మరించి, నిప్పంటించారు మంత్రిగారు. భగ్గున నిలువెత్తున మంటలు లేచాయి.

★ ★ ★

సరిగా అదే సమయాన - అదే శ్మశానంలో మరో మూల - ఆ పుల్లా, ఈ పుల్లా ఏరుకుని, చెత్తాచెదారం పోగు చేసి, భార్య శవాన్ని దహనం చెయ్యడానికి నానాతిప్పలూ పడుతున్నాడు అనామకుడు.

చినుకు కాస్త పెద్దదైంది. అంటుకున్న నిప్పు ఆరిపోయింది. ఇంకేం చెయ్యలేక చతికిలబడ్డాడు అనామకుడు. వాళ్ళదగ్గిరా వీళ్ళ దగ్గిరా అడుక్కున్న పైసలు కాటి సుంకానికే సరిపోయాయి. కట్టెలు కొనడానికి మిగల్లేదు.

తలెత్తి నల్దిక్కులా చూశాడు. ఆ మూల – మంత్రిగారి బామ్మగారి చితి ఇంకా దివిటీ వెలిగినట్టు వెలుగుతూనే వుంది.

ఉన్నట్టుండి ఆకాశంలో నలువైపులా కారుమబ్బులు కమ్ముకొచ్చాయి. మంత్రిగారి బామ్మగారి అంత్యక్రియలు చూడ్డానికొచ్చిన జనమంతా వెళ్ళిపోయారు. బామ్మగారి భౌతికకాయం దాదాపు బూడిదైంది. బూడిదయ్యేదాకా వుంటామన్న వాళ్ళిద్దరూ, కాస్త వెచ్చగా ఏదైనా తాగివద్దామని ఎక్కడికో వెళ్ళారు; శ్మశానంలో ఒక్క పురుగు మిగల్లేదు; అనామకుడు తప్ప!

అంతా వెళ్ళిపోయాక అనామకుడు మెల్లగా లేచి, భార్య శవం భుజాన వేసుకుని, బామ్మగారి చితి దగ్గరకొచ్చాడు; శవాన్ని కింద దింపాడు; ఒక్క నిమిషం ఆలోచించాడు ఆలోచించే వ్యవధి లేదు. పెద్ద వర్షం వచ్చేట్టుగా వుంది. వేరే చితి తయారుచేసి అంటించాలంటే కష్టం; ఈ లోగా యెవరైనా రావచ్చు. అందుకే వెంటనే తన కర్తవ్యం నిర్ణయించుకున్నాడు.

విడిగాపడివున్న కట్టెలు కొన్ని తీసి చితిలో వేశాడు. భార్య శవాన్ని చితిమీద వుంచి మరికొన్ని కట్టెలు వేశాడు. మంటలు మళ్ళీ నిలువెత్తున లేచాయ్!

★★★

కొద్ది రోజుల తర్వాత – మంత్రిగారి బామ్మగారి చితాభస్మాన్ని నగరానికి సమీపాన వున్న నదిలో కలపడం కోసం – పెద్ద ఎత్తున ఏర్పాటైన కార్యక్రమంలో, అనామకుడు కూడా ఆనందంగా పాల్గొన్నాడు.

O

*(సృజన – ఆగస్టు – 1971)*